# వివేకములేని విద్య, విచక్షణలేని జ్ఞానము రాణించదు

విశ్వమందు విభుడు వెలుగొందుచుండు
విభునియందు విశ్వమువెలుగుచుండు
విశ్వవిభులమైత్రి విడదీయరానిది
వినుడు భారతీయ వీరసుతుడ
విద్యయొసగు వినయము
వినయంబువలన కలుగు పాత్రత
పాత్రతవలన ధనము ధనమువలన ధర్మంబు
ధర్మంబువలన ఐహికాముష్మికములనొందు నరుడు

ప్రేమస్వరూపులైన విద్యార్థులారా!

ప్రాచీనకాలమున విద్యనభ్యసించుటకై గురువులచెంత చేరునప్పుడు విద్యార్థులకు 'విధేయుడు' అనేటువంటి పేరు పెట్టెడివారు. క్రమక్రమేణా యీ విధేయుడు అనే పదమునకు విరుద్ధమైన అర్థము కల్పించి విద్యార్థి అనేటువంటి పేరును నియమిస్తూ వచ్చారు, విద్యార్థి అనగా విజ్ఞానసముపార్జితము చేసేటువంటివాడు. అనగా విద్యను నేర్చేటువంటివాడు. ఈ విధంగా విద్యయొక్క ప్రయోజనము వినయ విధేయతలనుండి విద్యాసముపార్జితమునకు దిగజారిపోయింది. కానీ, యిప్పుడు ఇంకా దిగజారి, విద్యార్థి కేవలము విషయార్థిగా మారిపోతూవస్తున్నాడు.

**శాస్త్రజ్ఞానముతోబాటు అనుభవజ్ఞానము సంపాదించాలి**



srisathyasaivachanamrutam

విద్యవలన ఒనగూడే జ్ఞానమును శాస్త్రజ్ఞానమని, అనుభవజ్ఞానమని, వివేకజ్ఞానమని, లౌకికజ్ఞానమని నాలుగు విధములుగా విభజిస్తూ వచ్చారు. ఈ శాస్త్రజ్ఞానము, రసాయనశాస్త్రము, పదార్థవిజ్ఞానశాస్త్రము, వృక్షశాస్త్రము, జీవశాస్త్రము మొదలగు విభాగములకు చెందినది. ఇది విషయాలకు సంబంధించినటువంటిది. కనుక విద్యార్థినుండి విషయార్థికి దిగజారిపోయింది. ఈనాటి విద్యార్థి విద్య అంటే యేమిటో అనే విషయాన్ని విస్మరిస్తూపోతున్నాడు. శాస్త్రజ్ఞానముతోబాటు ప్రతివ్యక్తి అనుభవజ్ఞానము సంపాదించాలి. అనుభవజ్ఞానములేని విద్య లోకమునకు యేమాత్రము వుపయోగించదు. అనుభవజ్ఞానము మానవునకు యెంతప్రధానమో దానికి జగత్తునందు అనుభవరీతిగా అనగా స్వరూపరీతిగా అందించేటువంటి విజ్ఞానముకూడను అనగా వివేకజ్ఞానము మానవునికి అంత అవసరము. ఈ వివేకమనేటువంటిదానికి, విద్యకు కొంత విరుద్ధమైన సంబంధమున్నది. వివేకము లేని విద్య, విచక్షణలేని జ్ఞానము మానవుని రాణింపచేయదు. వివేకము వేరు, విద్య వేరు. వివేకమనగా మంచిచెడ్డలకు మధ్య వున్నటువంటి వ్యత్యాసము. సుఖదుఃఖములకు మధ్య నున్నటువంటి వ్యత్యాసము. సత్యాసత్యములకు మధ్య నున్నటువంటి వ్యత్యాసము గుర్తించుటే వివేకము.

**విజ్ఞత అనేది వివేకములోని అంతర్భాగమే!**

ఈ వివేకమును గుర్తించిన తరువాత, అనగా యీ వ్యత్యాసమును గుర్తించిన తరువాత దేనికి యెప్పుడు, ఎక్కడ, ఎట్లా దానికి తగినటువంటి ప్రాముఖ్యత యివ్వాలి అనేటువంటి విషయమును విచారించటమే విజ్ఞత. ఏ వస్తువునకు యే ప్రదేశములో, యేకాలములో, యేవిధమైనటువంటి ప్రాముఖ్యత యివ్వాలి అనే విషయాన్ని విచారించి దానిని నిర్ణయించేటువంటి శక్తికే విజ్ఞత అని పేరు. ఈ విజ్ఞత అనేది వివేకములోని అంతర్భాగమే! వివేక విచక్షణలు లేనటువంటివాడు సన్మార్గములో ప్రవేశించలేడు. సన్మార్గములో జీవితాన్ని గడపాలని ఆశించేటువంటి ప్రతివ్యక్తికూడను వివేక, విజ్ఞానములతో జీవించటానికి ప్రయత్నించాలి. అయిన్‌స్టీన్ ఒకానొక సమయములో 'కార్యాన్ని సాధించేటువంటిదిగా వుంటుండాలి. జ్ఞానముతోకూడినటువంటి కార్యముగా వుంటుండాలి' అన్నాడు. ఈనాడు

sri sathyasai vahini

కార్యాన్ని సాధించలేనటువంటి విజ్ఞానము, విజ్ఞానమును వుపయోగించుకోలేనటువంటి కార్యము, ఎక్కడ చూచినా మనకు గోచరిస్తున్నాయి. కేవలము పేరునకు మాత్రమే వుపయోగించుకొనుచున్నారేగాని మానవత్వముయొక్క విశిష్టతను గుర్తించటానికి ప్రయత్నించటములేదు. మానవతారహితమైన విజ్ఞాని యెంత ధనవంతుడైనను, యెంతటి విజ్ఞానవంతుడైనను, యెంతటి విద్యావంతుడైనప్పటికి సమాజము అతనిని గౌరవించదు. అట్టి శక్తి సామర్థ్యములను పొందిన వ్యక్తి ప్రజామన్ననలను పొందలేడు. అణుపరిశోధనాశక్తులచేత క్షణములో బ్రహ్మాండమునంతా భస్మము చేసేటువంటి మారణాస్త్రములు కనిపెట్టవచ్చును. అదే అణుశక్తి పరిశోధనలచేత కొన్ని కోట్ల విద్యుత్‌శక్తిని అభివృద్ధిపరచి తద్వారా పారిశ్రామికముగాను, వ్యవసాయమును అభివృద్ధిపరచి దేశమును సస్యశ్యామలము గావించవచ్చును. ఇంతియేకాదు, కోట్లప్రజలకు ఉపాధిని అందించవచ్చును. ఇట్టి లోకమునకు వుపకారము చేయు వివేకమును ప్రతి మానవుడు సమాజములో వుపయోగించటమే యీ విజ్ఞానముయొక్క పరమలక్ష్యము. ఈ వివేకజ్ఞానమునే లోకకళ్యాణార్థమై, లోక సంగ్రహణార్థమై వినియోగించినప్పుడు యిది సరియైనటువంటి విద్యగా రూపొందుతుంది. అట్లుకాక, లోకసంక్షోభమును, సర్వనాశనమును గావించేటువంటి విద్యలు కేవలము ఒక వికృతమార్గమును అనుసరించిన తత్వాన్ని పొందుతుంది. ఇట్టి వ్యక్తులయొక్క తత్వమునుకూడను ప్రపంచము దూషించుతుంది. ఈవిధంగా తన శక్తిని దుర్వినియోగ పరచుకొనేటువంటి వ్యక్తులను లోకకంటకులని ప్రపంచము నిందిస్తుంది. నిజముగా మనము నేర్చిన విద్యలు మన సమాజమునకు, మనతోటి మానవులకు తగిన సహకారమును, సహాయమును, మంచిని చేకూర్చేటువంటివిగా రూపొందాలి. నిస్వార్థ పరార్థములను పెంచి యథార్థమైన రూపాన్ని నిరూపించేదిగా వుండాలి. శాస్త్రజ్ఞానముతోబాటు అనుభవజ్ఞానము, అనుభవజ్ఞానముతోబాటు వివేకజ్ఞానము నిరూపించాలి.

**శాస్త్ర, అనుభవ, వివేకజ్ఞానములతోబాటు లౌకికజ్ఞానముకూడా అత్యవసరము**

ఈ మూడింటి సమ్మిళితమైన జ్ఞానమును పొందినటువంటి వ్యక్తి తన యెదురుగాను

దూరముగానుకూడా వుండిన వ్యక్తులయొక్క గుణతత్వాన్ని సులభముగా అర్థము చేసుకొనగలడు. అనుభవజ్ఞానము, విజ్ఞానము, విచక్షణ లేనటువంటి మానవుడు తన చెంతనున్న పవిత్రమైన హృదయాన్ని గుర్తించుకోలేనటువంటి అంధుడౌతాడు. కమలపుష్పములో వుండిన మకరందముయొక్క వాసనను కడుదూరముగా వుండిన తుమ్మెద గుర్తించి నేరుగా కమలముపైన వచ్చివ్రాలి ఆ మకరందాన్ని, మాధుర్యాన్ని అనుభవిస్తుంది. కాని, ఆ కమలమునే ఆధారము చేసుకొని క్షణకాలమైనను విశ్రాంతిని పొందాలని ఆశించినటువంటి కప్ప కమలముపైన వుండినప్పటికీ దాని మకరందమును గ్రోలలేదు. కారణము, విజ్ఞాన, విచక్షణ అనేటువంటి విషయాన్ని గుర్తించుకోలేని పరిస్థితియే! ప్రతిమానవుడు శాస్త్రజ్ఞానముతోబాటు అనుభవజ్ఞానము, వివేకజ్ఞానము తప్పనిసరిగా సంపాదించుకోవాలి. ఈ గ్రంథపరిచయములైనటు వంటి జ్ఞానములన్నియు లోకానికి వుపయోగమైనటువంటి విషయమును, విధానాన్ని నేర్పలేవు. ఈ శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, వివేకజ్ఞానములతో బాటు లౌకికజ్ఞానము కూడను అత్యవసరము. ఈ నాలుగు జ్ఞానములను పరిపూర్ణముగా ఆర్జించినవాడు, అందుకొన్నవాడే విద్యావంతుడు అని చెప్పవచ్చును.

**భారతీయుల చరిత్ర, సంస్కృతులు అవగాహన చేసుకోవడానికి క్షేత్రదర్శనములు, తీర్థయాత్రలు చేయాలి**

లౌకికజ్ఞానము కేవలము గ్రంథములద్వారా అందుకొనేటువంటిదికాదు. గురువులయొక్క బోధలచేత లభించేదికాదు. దేశాటనముచెయ్యాలి. మన భారతీయ సంస్కృతిని అనుసరించి, నాగరికతను పురస్కరించుకొని, చరిత్రను ఆధారముగా చేసుకొని, కళాసంపత్తిని పురస్కరించుకొని అనేక ప్రాంతములందుండిన అద్భుతమైన అఖండమైన చిత్రకళలను, శిల్పకళలను మనము గుర్తించటానికి ప్రయత్నించాలి. ఆ ప్రాంతము ప్రజలు యేవిధమైన జీవితము గడపుచున్నారు, వారి సంస్కృతి యేవిధమైనటువంటి విధానములో జరుగుతూ వుంటున్నాది, ఇవన్నియూ వారితో కలసిమెలసి గుర్తించటానికి ప్రయత్నించాలి. ప్రాచీన భారతీయుల మహత్వపూర్వకమైన

sri sathyasai vachanamrutam

కళలను మనము దర్శించాలి. ఈనాటికి అజంతా, ఎల్లోరా, హంపీ యిత్యాది ప్రదేశములయందు అనేక విధములైన చిత్రవిచిత్రములతో కూడినటువంటి సౌందర్యము మనకు కళ్ళకు కట్టినట్లు గోచరిస్తుంది. ప్రకృతి సౌందర్యాన్ని మనము చక్కగా తిలకించటానికి ప్రయత్నించాలి. పర్వతములయొక్క అందమును, వృక్షములయొక్క ఛాయను దీనిలో యేవిధముగా అనుభవిస్తున్నారు, దీనియొక్క అనుభూతులు మానవునికి యేవిధముగా తోడ్పడుతున్నవి అనే విషయమును మనము గుర్తించాలి. క్షేత్రదర్శనములు, తీర్థయాత్రలు సలుపుతూ రావాలి. కనుకనే ప్రాచీన మానవులు, ముఖ్యంగా భారతీయులు యీ విధమైనటువంటి సంకల్పమును దృష్టియందుంచుకొని తీర్థయాత్రరూపములో ఆ ప్రదేశముల యొక్క చరిత్రను, సంస్కృతిని, ఔన్నత్యమును గుర్తిస్తూవచ్చారు. దీనినే విద్యార్థి లోకమునకు కొంతవరకు పరిచయము చేయడానికి excursion అనే పేరుతో విద్యార్థులను అనేక ప్రాంతములకు తీసుకొనిపోవటము ప్రారంభించారు. ఈ excursion అనేది లౌకికజ్ఞానమును బోధించుటకు తీసుకువెళ్లటము. ఈ లౌకికజ్ఞానమే లేకుండిన శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, వివేకజ్ఞానము నిరుపయోగమవుతాయి.

**మంచి, చెడులను గుర్తింపజేసే విద్యను అభ్యసించాలి**

ఈ అన్నింటియందు విద్యయొక్క సారాంశమైన వినయాన్ని మనము నిరూపించాలి. వినయములేని విద్య, విచక్షణలేని కార్యము, విజ్ఞతలేని పాండిత్యము, మాధుర్యములేని సంగీతము, కృతజ్ఞతలేని బంధుత్వము, పవిత్రతలేనటువంటి స్నేహము, క్రమశిక్షణలేని సంఘము, భక్తిలేని కీర్తన యివన్నీ ప్రజారంజితము కాలేవని బోధిస్తూవచ్చారు. ఈవిధంగా ప్రతిదానికికూడను ప్రాచీనులు కొన్ని అర్హతలను నిరూపిస్తూవచ్చారు. ఈనాడు ఈ అర్హతలనంతా తమ తమ యిష్టాయిష్టములపైన నిరూపిస్తూవున్నారు. నీవు చేసినా, నేను చేసినా యెవరు చేసినప్పటికిని తప్పు తప్పే, మంచి మంచే! ఇలాంటి సమత్వభావముతో న్యాయమును నిరూపించేటువంటి విద్యను మనము అభ్యసించాలి. పరదేశీయులు కావచ్చు, స్వదేశీయులు కావచ్చు. స్వదేశీయులైనా పరదేశీయులైనా మానవత్వము ఒక్కటే! ఈ మంచి చెడ్డలను గుర్తింపచేసుకొనే విద్యను మనము అభ్యసించాలి. కానీ మనకు యిష్టమే వుండిన

యెంతటి కష్టములకైనా, యెంతటి నష్టములకైనా అవి సుఖములుగానే యిష్టములుగానే మనము భావిస్తాము. మనకు యిష్టమే లేకుండిన యెంత మంచిదైనా, యెంత పవిత్రమునైనా మనము కష్టముగానే అనుభవిస్తాము. ఇది విద్యయొక్క వికృతి మార్గము. విద్యయందు యీ విధమైనటువంటి వికృతిని మనము అభివృద్ధి పరచరాదు. దేశాభిమానము వుండవచ్చు. దేహాభిమానము వుండవచ్చు. కానీ అంత మాత్రమున తప్పును ఒప్పుగా, ఒప్పును తప్పుగా మనము భావించరాదు. కనుక యీ National character అనే దానిలోపల యీ సమత్వాన్ని మనము చక్కగా అభివృద్ధి పరచుకోవాలి. దీనికి కొన్ని ఉదాహరణములు.

**ఈనాడు భారతీయులు, భారతీయులనే దోచుకుంటున్నారు**

స్వతంత్రము రాకపూర్వము భారతదేశమునందు విదేశీయుల పరిపాలన వుండేటువంటిది. అప్పుడు దేశరక్షణకై ముప్పైవేలమంది సిపాయిలు ఉండేవారు. ఇంత పెద్ద దేశమునకు ముప్పైవేలమంది సిపాయిలను మాత్రమే నియమించారు. ఈ ముప్పైవేలమంది సిపాయిలకు ఏభైకోట్లు ధనమును వ్యయము చేస్తూ వచ్చారు, బ్రిటీషువారు. అప్పుడు దేశాభిమానము కలిగినటువంటి భారతీయులు బ్రిటీషువారిని నిందిస్తూ వచ్చారు. యీ defence పేరున యాభై కోట్లు ఖర్చుపెడుతున్నారు. భారతదేశమును దోచుకుంటున్నారు. భారతదేశమును బీదరికముగా రూపొందింపచేస్తున్నారని విమర్శిస్తూ వచ్చారు. దీనికి కారణము యేమిటి? విదేశీయులు మన దేశమువచ్చి పరిపాలన చేస్తున్నారనే ద్వేషముపైన పుట్టినటువంటి భేదములే! యీ నలభై సంవత్సరములలోపల స్వతంత్రము వచ్చిన తరువాత మన భారతదేశమును సంరక్షించుకొనే నిమిత్తమై పదహైదులక్షలమంది సిపాయిలవరకు సంఖ్యను పెంచారు, మన వారు. ఈ పదహైదులక్షల సిపాయిలకంతా యిప్పుడు పన్నెండువేల కోట్లు ఖర్చుపెడుతున్నారు డిఫెన్సులోపల. అప్పుడు యాభై కోట్లు మాత్రమే. కానీ యీనాడు చూస్తే యిన్ని కోట్లు ఖర్చు పెడుతుంటే యీ రోజు మనము పెట్టేటువంటిది న్యాయము అనుకుంటున్నాము. వారు పెట్టింది అన్యాయమనుకుంటున్నాము. అంతవరకు మనము

srisathyasaivachanamrutam

పోనక్కరలేదు. మద్రాసు, కేరళ, ఆంధ్ర యీ మూడు చేరి మద్రాసు స్టేటుగా వుండేటువంటిది. అనగా విశాఖపట్టణము మొదలు కన్యాకుమారి వరకు ఒకే రాష్ట్రముగా వుండేటువంటిది. ఐదువేలమంది పోలీసులు వుండేటువంటివారు. ఈనాడు కొన్ని వేలమంది పోలీసులు వుంటున్నారు. అప్పుడు ఈ పోలీసులకంతా చేరి ఒకే I.G.P. ఇప్పుడు ఒక్కొక్క state కి అనేకమంది I.G.P. లు తయారయ్యారు. పూర్వము యీ మూడు స్టేట్సుకు కలసి ఒక I.G.P. వుంటే యీనాడు ఒక్కొక్క స్టేటుకు 12 మంది 14 మంది I.G.P. లు. ఇది యెంత ఖర్చుగా వుంటుంది! కనుకనే యీనాడు భారతదేశము అప్పుల పాలైపోతున్నాది. ఖర్చు అధికము, ఆదాయము తక్కువ. పన్నెండువేలకోట్లు ఒక్క defenceకు మాత్రమే ఖర్చు పెడుతున్నారు. ఇంక పదివేలకోట్లు అప్పుకు వడ్డీగా చెల్లిస్తున్నారు. మిగిలినటువంటికోట్లంతా సంవత్సరమునకు అధికముచేస్తూ, అధికముచేస్తూ జీతాలపైన అందిస్తున్నారు. మన భారతదేశములో వసూలయ్యే ధనమంతయు యీ మూడింటికే ప్రధానముగా వినియోగిస్తున్నారు. మిగిలిన అభివృద్ధికి చేతిలో ధనములేదు. కనుక, యితర దేశములనుండి అప్పుగా అందుకుంటున్నారు. ఈనాడు మన భారతదేశానికి అప్పు యెంత వున్నదంటే ముప్పైమూడువేలకోట్లు వుంటున్నాది. యీ అప్పునకు సంవత్సరమునకు పదివేలకోట్లు వడ్డీ చెల్లిస్తున్నారు. అప్పు చేసినా మంచిదే కానీ, దేశమును తాకట్టు పెట్టటానికి మాత్రము మనము అంగీకరించరాదు. ఇంకా క్రమక్రమేణా యిది పెరిగి పెరిగి యింక యెంతవరకు అవుతుందో, చివరకు దేశమునే తాకట్టుపెట్టటానికి పూనుకుంటారో యేమో చెప్పటానికి వీలుకాదు. ఒక చిన్న ఉదాహరణము మీ కందరకు తెలుసు. బ్రిటీషు వారిపాలనలో ఒక బేరల్ పెట్రోల్‌కు నాలుగురూపాయలు. అబ్బ నాలుగు రూపాయలు వసూలుచేసి భారతదేశమును కొల్లగొడుతున్నారు. 'ఒక బేరల్ పెట్రోలుకు నాలుగు రూపాయలా?' అని మన లీడర్సు అంతాకూడను వారికి యెదురుతిరిగారు. ఈనాడు బెరల్ పెట్రోలుకు నాలుగువందలరూపాయలు. ఇది యెవరు దోచుకుంటున్నారు? భారతీయులు భారతీయులనే దోచుకుంటున్నారు. ఇలాంటి దోషములనంతా నిర్మూలనముగావించి మన విద్యార్థులు సహనము, సానుభూతితో సరియైనటువంటి మార్గమునందు, పరిశుద్ధమైన రూపముగా తీర్చిదిద్దుతారని ఆశిస్తున్నాను.

sri sathyasai vahanamrutam

## 'జ్ఞాతుం, ద్రష్టుం, ప్రవేష్టుం'

శాస్త్రజ్ఞానమని, అనుభవజ్ఞానమని, వివేకజ్ఞానమని మూడు పేర్లతో వ్యవహరిస్తున్న ఈ విభాగములనే వేదాంత పరిభాషయందు 'జ్ఞాతుం, ద్రష్టుం, ప్రవేష్టుం' అని చెబుతూ వచ్చారు. శాస్త్రజ్ఞానమనగాయేమిటి? గ్రంథములో మనము చదివినదానియొక్క విషయాన్ని గుర్తించటము. అనగా, ఒక పదార్థముయొక్క విషయాన్ని చక్కగా గ్రంథముద్వారా తెలుసుకోటము, గ్రంథముద్వారా తెలుసుకొన్నటువంటి విషయాన్ని ప్రాక్టికల్‌లోపల పరిశీలన చేయటము. దీనిని experiment ద్వారా నిరూపించడం, తరువాత దానిని హృదయములో హత్తుకొనిపోవునట్లుగా ప్రవేశింపచేసుకోటము. ఈ మూడింటియొక్క చేరికయే దీనియొక్క సరియైన పూర్ణత్వము. కేవలము గ్రంథములో చదివినంతమాత్రమున మనము జ్ఞానులము కాలేము. లాబరేటరీలో దర్శించినంత మాత్రమున పూర్ణజ్ఞానులు కాలేము. దర్శించినటువంటి దానిని హృదయములో చేర్చుకోవాలి. దీనికొక చిన్న ఉదాహరణము. నీకు ఒక ఫలముపైన చాలా యిష్టముగా వుంటుంది. ఈ ఫలములు మార్కెట్టుకు వచ్చినాయని నీ freinds వచ్చి చెప్పారు. ఇది కేవలము శాస్త్రజ్ఞానము. అనగా వినికిడిచేత తెలిసినటువంటిది. 'ఓహో! నేను ఆశించినటువంటి ఫలములు మార్కెట్టునకు వచ్చినాయట!' అని తెలుసుకోగానే కొంత సంతోషము కలుగుతుంది. అంత మాత్రముచేతనే మన కడుపులోనికి ఆ ఫలము చేరలేదు. నీవు మార్కెట్టుకు వెళ్ళాలి, ఆశించిన ఫలము వుందాలేదా అని దర్శించాలి. అలా దర్శించేటప్పటికి మరింత ఆనందము పెరిగిపోతుంది. ఆనందము పెరిగిపోతుందిగానీ మన కడుపులోనికి ఆహారముగా చేరలేదు. దానిని డబ్బిచ్చి కొనుక్కొని భుజించాలి. ఈ భుజించిన తరువాత పరిపూర్ణానందము లభిస్తుంది. ఆహారము లోపల చేరిపోయింది. తెలుసుకోవడం జ్ఞానం, చూడటం ద్రష్టుం, తినటం ప్రవేష్టుం. అప్పుడే ఆ ఫలముయొక్క పరిపూర్ణత్వాన్ని అనుభవించినవాడౌతాడు. అదే విధముగనే మీరు చదివినటువంటిదానిని అనుభూతిలోపల తెప్పించుకోవాలి. కేవలము చదివినంత మాత్రముననే విద్యావంతులమని విఱ్ఱవీగరాదు. అనుభూతిలో తెప్పించుకున్న దానిని ఆనందముతో అనుభవించి యితరులకు అందించాలి.

sri sathyasai vacharamrutam

**ప్రియము, మోదము, ప్రమోదము**

దీనినే ప్రియము, మోదము, ప్రమోదము అని ఆధ్యాత్మిక మార్గములో ప్రబోధిస్తూ వచ్చారు. 'ప్రియం' అనగా యేమి? నీ కిష్టమైన, ఆప్తులైన వారిని గురించి సమాచారము నీవు విన్నప్పుడు ఆనందిస్తావు. దాన్ని చాలా ప్రేమతో అనుభవిస్తావు. నీకు చాలా ప్రియమైన వస్తువుల విషయంగానీ వ్యక్తి విషయంగానీ నీకు చెప్పినప్పుడు కొంత ప్రియము కలుగుతుంది. ఆనందము కలుగుతుంది. కానీ ఆ ప్రియమైనటువంటి వ్యక్తినే నీవు పోయి చూచినప్పుడు మరింత ఆనందముతో వుప్పొంగిపోతావు. ఆ చూచి అనుభవించినటువంటి ఆనందమునకు 'మోదము' అని పేరు. ఆ వ్యక్తిని మనము అనుభవించినటువంటిదే ప్రమోదము అని పేరు. నీకు యిష్టము వచ్చినటువంటి వ్యక్తిని మాత్రమే నీవు చింతిస్తూ వున్నంత మాత్రమున నీవు పూర్ణానందమును అనుభవించలేవు. ఆ వ్యక్తిని సమీపించాలి. సమీపించిన వ్యక్తితో మనము చేరిపోవాలి. కనుక 'వినటము, సమీపించటము, చేరిపోవటము' యీ మూడింటియొక్క యేకత్వమునకే పరిపూర్ణత అని పేరు. అదే మానవత్వానికి సరియైనటువంటి గుర్తు అన్నారు. దీనినే The Proper study of mankind is man అన్నారు. అనగా thought, word, action యీ మూడింటియొక్క యేకత్వమే పూర్ణత్వమన్నారు. కనుక మనము చదివినటువంటి విషయాన్ని అనుభూతిలోకి తెప్పించుకోవాలి. అనుభవించినటువంటిదానిని పెంచుకోవాలి. పదిమందికి పంచుకోవాలి. నీ అనుభూతిలో వుండినటువంటిదానిని వూరికే పంచకుండా పెట్టుకొన్నప్పుడు అది ద్రోహముగా మారుతుంది. దీనిని పదిమందికి పంచకుండా పోయినప్పుడు స్వార్థపరుడైపోతావు. స్వార్థపరునికి మంచి, చెడ్డ, పరోపకారము అనేటువంటి తత్వము గుర్తుకురాదు. మానవుడనేటువంటివాడు స్వార్థరహితుడుకావాలి. ఆస్వార్థరహితత్వములో అభివృద్ధి పరచుకున్నప్పుడే మన విద్య సార్థకమవుతుంది. ఈ పవిత్రత అంతా బయటతట్టున వున్నదా లేక మనయందున్నదా? కనుక మనము చేసే పనులలోపల మంచి చెడ్డలను చక్కగా గుర్తించటానికి ప్రయత్నించాలి.

**మన హృదయమందుండిన దుర్భావములను, దుశ్చింతలను, దురభ్యాసములను దూరము**

sri sathyasai vahini / srisathyasai vachanamrutam

## చేయటానికి పూనుకోవాలి

యీనాటి మన education యేవిధముగా వుందంటే బయటివారి దోషములను పరికించటానికి ప్రయత్నిస్తున్నాము తప్ప, మనలో వున్నటువంటి దోషాలు వెతకటానికి యేమాత్రము ప్రయత్నించటము లేదు. బయట నున్నటువంటి మంచిని మనము స్వీకరించాలి. మనయందున్నటువంటి దోషాన్ని విసర్జించాలి. మనయందున్నటువంటి దోషములు విసర్జించినప్పుడే బయటి మంచిని స్వీకరించటానికి మనము అర్హులవుతాము. బయటనున్నటువంటి పాలను యీ పాత్రలో పోయాలనుకుంటే యీ పాత్రలో వున్న నీరును పారపొయ్యాలి. దీనిని పారపోసినప్పుడే దానిని చేర్చుకోటానికి వీలవుతుంది. దీనిని పారపోయక దానిని చేర్చుకోటానికి వీలుకాదు. కనుక మన హృదయమునందుండిన దుర్భావములను, దుశ్చింతలను, దురభ్యాసములను దూరము చేయటానికి పూనుకోవాలి. అప్పుడే అందులో సద్భావములు, సద్గుణములు, సదాచారములను నింపుకోటానికి వీలవుతుంది.

## మనస్సును ఆత్మవైపు మరలిస్తే దాని ప్రభావము మనపై ఉండదు

అనేకమంది అనేక విధములుగా వాపోతుంటారు, 'స్వామీ మా మనసును మేము నిగ్రహించుకోలేకపోతున్నాము. మా యింద్రియములను అరికట్టుకోలేక పోతున్నాము. ఏ విధముగా అరికట్టాలి యే విధముగా నిగ్రహించాలి', అని. కొంతమంది పిల్లలుకూడా నన్ను అడుగుతుంటారు. నిగ్రహించుకోటము, అరికట్టుకోటము యీ విధమైన పెద్ద పెద్ద పరిశ్రమలో మీరు ప్రవేశించనక్కరలేదు. దీనికి చక్కని సులభమైన మార్గము ఒకటి వుంది. చంద్రుడు స్వయం ప్రకాశకుడుకాదు. సూర్యునియొక్క వెలుతురు చంద్రునిపై పడటంచేతనే చంద్రుడు ప్రకాశిస్తున్నాడు. సూర్యుడు లేనప్పుడే చంద్రకాంతి మనకవసరము. సూర్యుడేవుంటే చంద్రుని మనము లక్ష్యము చేయము. చంద్రుని పట్టించుకోము. ఈ చంద్రునియొక్క వెలుతురులో మనకు అనేక సందేహములు కలగుతూవుంటాయి. సూర్యుని వెలుతురు నిస్సందేహమైనది. సూర్యుని వెలుతురులో దూరములో



srisathyasaivachanamrutam

వుండినటువంటి త్రాడును త్రాడు, పామును పాము అని స్పష్టంగా మనం గుర్తిస్తాము. కొంత దూరములో వుండినటువంటి వ్యక్తిని మనము ఫలానా వ్యక్తి అని నిర్ణయము చేసుకోగలము. సుస్పష్టముగా గోచరిస్తుంది మనకు, వస్తువుయొక్క స్వరూపము. కానీ చంద్రుని ప్రకాశములోపల అంత స్పష్టతలేదు. త్రాడును చూచి పాము అనుకోవచ్చును, పామును చూచి త్రాడు అనుకోవచ్చును. ఒక వ్యక్తిని చూచి యింకొక వ్యక్తిగా మనము భావించవచ్చును. కారణమేమిటి? దీనికంత ప్రకాశము లేకపోవటంచేతనే సందేహాలు మనలో ప్రవేశిస్తుంటాయి. అదే విధముగనే మన మైండ్ అనేటువంటిది చంద్రుడు. 'చంద్రమా మనసో జాతః చక్షో స్సూర్యో అజాయతః'. ఈ చంద్రుడనేటువంటివాడు మన మైండ్. ఈ మైండ్‌కు స్వప్రకాశము లేదు. కేవలము ఆత్మయొక్క ప్రకాశము దీనిపైన పడుతూ వుండాలి. కనుక యీ చంద్రుని దీనిలోపల అన్నీ doubts వస్తున్నాయి. Is it right or wrong? Is it good or bad? ఈ సంధిగ్ధావస్థలో మానవుడు సంకుచిత భావములో మునిగిపోతున్నాడు. ఇది యెంతవరకు వుంటాది? ఈ మైండ్ భావన చేసేంతవరకు సందేహాలు మనకు వుంటాయి. ఈ మైండ్‌యొక్క వుపయోగము మనకెంతవరకు వుంటాది? ఆత్మ అనే లక్ష్యమును గుర్తించలేనంతవరకు వుంటాది, యిది. అనగా సూర్యుడు లేనంతవరకు చంద్రుని వుపయోగం మనకు వుంది. ఆత్మలక్ష్యము లేనంతవరకు వుంటుంది యిది. మనము సూర్యునే చూడగలిగినప్పుడు చంద్రుని లక్ష్యము చేయముకదా! అదే విధముగా మన దృష్టి అంతాకూడను ఆత్మవైపు మరల్చినప్పుడు మనసుయొక్క భావమే శూన్యమైపోతుంది. మీ concentration అంతా మైండ్‌పైన చేస్తూ ఆత్మ నాకు లభ్యము కావాలంటే యెట్లా అవుతుంది? కనుక నీవు యింద్రియాల్నిగానీ, మనస్సుగానీ, అరికట్టుకోటానికి పరిశ్రమ చేయనక్కరలేదు. నీమనస్సును ఆత్మవైపు మరల్చినావంటే మనస్సు తనంతటతానే అలక్ష్యము చేసుకుంటూపోతుంది. సూర్యుడు లేనంతవరకు చంద్రుడు యెంత అవసరమో అదే రీతిగా ఆత్మభావములేనంతవరకు మైండ్ మనకు అంత అవసరము. ఆత్మ లక్ష్యము కుదిరిన మైండ్‌ను యేమాత్రము లక్ష్యము చేయము. దానికి రూపనామములే వుండవు. ఇప్పుడు చూడు, సూర్యుడు ప్రకాశిస్తున్నాడు. చంద్రుడు ఒక వైపు వుంటాడు. కానీ దానిని యెవరు చూస్తున్నారు? కనుక, మీరు మనసును

sri sathyasai vahini

యింద్రియములను అరికట్టుకోటమనేటువంటి విషయమును పెద్ద పరిశ్రమగా తీసుకొని బాధపడనక్కరలేదు. మనస్సును ఆత్మవైపు మరలిస్తే చంద్రుని తత్వము, మనస్సుయొక్క భావము సునాయాసముగా మనము తప్పించుకోవచ్చు.

**దైవమును పొందాలనుకుంటే దివ్యభావములను మనము పెంచుకోవాలి**

ఆదేవిధముగా భగవంతుడు సర్వవ్యాపకుడు, సర్వాంతర్యామి, సర్వజ్ఞుడు. అయితే, అందరియందు వుండిన ఆత్మతత్త్వము కొందరియందు మాత్రమే యెక్కువ ప్రకాశిస్తుండాదే, దీనికి కారణం యేమిటి? ఎక్కడ చూచినా ఒకే కరెంటుగా వుంటున్నాది కదా! కానీ, బెడ్‌రూం బల్బు డిమ్‌గా వుండటంయేమిటి, డ్రాయింగ్‌రూమ్ బల్బు బ్రైట్‌గా వుండటంయేమిటి? ఇది కరెంటుయొక్క వ్యత్యాసమా? కాదుకాదు, బల్బులయొక్క వ్యత్యాసము. మన capacity, మన అభిరుచి దీనికి కారణం. ఆత్మాన్వేషణ మనలో అధికముగా వుంటున్నప్పుడు అదే bright గా కనుపిస్తుంది. మనము నిరంతరము నిరుపయోగమైన దేహము, మనసు, బుద్ధి, యింద్రియములు, చిత్తము, అంతఃకరణ వీటిపైన లక్ష్యాన్నంతా వుంచి ప్రకాశవంతమైన వెలుతురు నాకు లభించాలంటే యెట్లా లభిస్తుంది? బ్యాటరీకి వేసేటువంటి బల్బును తగిలించుకొని పెద్ద వెలుతురును అందించాలంటే యెట్లా అందిస్తుంది? శాస్త్రము నిషేధిస్తూ వస్తున్నదానిని మనము అనుసరిస్తున్నాము. శాస్త్రము శరీరము, మనసు, బుద్ధి, చిత్తము, యింద్రియములను నేతి, నేతి, నేతి not this, not this, not this, అని త్రోసిపుచ్చింది. ఆ నిషేధించినటువంటి వాటిని మనము స్వీకరిస్తున్నాము. ఇవన్నీ ఆత్మయొక్క వుపాధులు. యీ వుపాధులను మనము ఆధారముగా తీసుకుని ఆత్మను విసర్జిస్తున్నాము. నిమిత్తకారణం ఒకటి. నిమిత్తకారణమనగా ఒక దాన్ని ఆధారము చేసుకొని తద్వారా ఆరూపాన్ని మనము అభివృద్ధి చేయాలి. ఉపాదానకారణము మరొకటి. మట్టి ఉపాదానకారణము. దాన్ని మనము ఆధారముగా తీసుకొని కుండ, చట్టి తయారు చేస్తున్నాము. ఈ pot, plate కూడను నిమిత్తకారణాలు. ఉపాదానకారణం మట్టి. ఈ పాత్రయందు మట్టివుంటున్నాది. అనగా యేమిటి, నిమిత్తకారణములోకూడను వుపాదాన కారణము వుండాది. ఆ

ఉపాదానకారణమును ఆధారముగా చేసుకున్నప్పుడే మానవత్వము సంపూర్ణమైనటువంటి దివ్యత్వమును పొందుతుంది. ఉపాదానకారణమును విడిచి నిమిత్తకారణము వుండలేదు. నిమిత్తాన్నైనా వదలి ఉపాదానకారణం వుండవచ్చునుగానీ ఉపాదానము వదలి నిమిత్తము వుండటానికి వీలుండదు. ఇది ఒక silver tumbler. ఈ silver tumbler కు ఉపాదానకారణము silver. ఈ tumbler లో కూడా silver వుంటుండాది. ఈ silver అనేది వుపాదానకారణం. ఈ tumbler నిమిత్తకారణం. నిమిత్తకారణమైన టంబ్లర్‌లో ఉపాదానకారణమైన సిల్వర్ వుంటున్నాది. కానీ ఉపాదానమనే silver తీసేస్తే నిమిత్తమనే tumbler వుండటానికి వీలుకాదు. అయితే దైవ దృష్టిలోపల ఉపాదానము వేరు, నిమిత్తము వేరుకాదు. ఉపాదాన, నిమిత్తములు రెండూ యేకమై వుంటున్నాయి. ఒక టంబ్లరును మనము సృష్టించాలంటే మనకు వెండికావాలి. ఈ వెండి వుండినప్పటికినీ చేసేటువంటి maker వుంటుండాలి. అనగా యీ makerకు tumbler యెట్లా చెయ్యాలి అనేటువంటి విధివిధానము తెలిసివుండాలి. అనగా యేమిటి? ఉపాదానకారణము, నిమిత్తకారణము, ఒక maker మూడింటి యేకత్వముచేతనే tumbler యేర్పడుతూ వున్నది. ఆ tumbler చేయటానికి maker యెవరు? కంసాలి. వెండిని సృష్టించేటువంటి వాడెవడు? భగవంతుడు. ఈ టంబ్లరు దేనివల్ల తయారైంది? వెండివల్ల తయారైంది. ఈ tumbler యొక్క విధివిధానాన్ని తెలిసిన వాడెవడు? వాడే కంసాలి. ఈ నిమిత్తకారణమైన tumbler, ఉపాదానకారణమైన వెండి, యీ tumbler యేర్పరిచినటువంటి కంసాలి, మూడు రకములుగా వుంటున్నాయి. ఈ చిన్న టంబ్లరును సృష్టించటానికే ఒకడుండాలి కదా. ఇంత పెద్ద ప్రపంచాన్ని సృష్టించటానికి ఒకడు వుండనక్కరలేదా?

**పొగకుమూలము నిప్పుల పుంజముండ**
**రైలుబండిని నడిపించు డ్రయివరుండ**
**ఆటోమేటికు లైటుకు అవధులుండ**
**ఒకడు జగతిని సృష్టించ నుండవలదె**

ఈ జగత్తును సృష్టించటానికి ఉపాదానకారణమేమిటి? నిమిత్తకారణమేమిటి? సృష్టించిన

srisathyasaivachanamrutam

వాడెవరు? దీనికి ఉపాదానకారణము, నిమిత్తకారణము, సృష్టించినవాడు మూడు ఒక్కడే అయిపోయినాడు. ఈ ఉపాదానకారణము దైవసంకల్పము. దైవముయొక్క సంకల్పమే సృష్టికి మూలకారణం. 'ఏకోహం బహుస్యాం'. ఈ సృష్టితత్త్వాన్ని గుర్తించటానికి ఉపాదానకారణమని, నిమిత్తకారణమని మనము వెదుకనక్కరలేదు. ఉపాదానకారణము, నిమిత్తకారణము సర్వము భగవంతుడే! కనుకనే సర్వజ్ఞుడు, సర్వవ్యాపి, సర్వశక్తిమయుడు అన్నారు. అట్టి సర్వజ్ఞత్వమైన తత్త్వాన్ని మనము గుర్తించాలంటే సర్వజ్ఞత్వానికి సమీపమునకు పోవాలి. అట్టి సమీపత్వాన్ని నిరూపించేవే వుపనిషత్తులు అన్నారు. కనుక దైవమును పొందాలనుకుంటే దైవత్వాన్ని మనము పెంచుకోవాలి.

**అహంకార నిర్మూలనము గావించే కర్మలన్నియు అకర్మలే!**

కర్మలు మనము తప్పక ఆచరించాలి. 'అకర్మ' అంటే యే కర్మ చేయకుండా సోంబేరుల మాదిరి కూర్చోటమా? అహంకార నిర్మూలనము గావించే కర్మలన్నియు అకర్మలే! అహంకారముతో చేసే కర్మలన్నియు ప్రతిబంధకములే! అహంకార రహితముగా కావించే కర్మలన్నియు అకర్మలగానే రూపొందుతాయి. ఈ అకర్మనుంచి వికర్మలోకి వస్తుంది. వికర్మనుంచి నిష్కామకర్మలోకి వస్తుంది. ఈ నిష్కామకర్మనే భగవదర్పితము గావించవలసినది. కనుకనే కర్మ, అకర్మ, వికర్మలయొక్క తత్త్వాన్ని భగవద్గీతలో బోధించటానికి యిదే మూలకారణము. మనము యే subject ను చదువుతున్నామో (ఒక Chemistry అనుకోండి, ఒక Physics అనుకోండి, Botany అనుకోండి, Zoology అనుకోండి) దేనినైనాకూడను మనము సక్రమమైన మార్గములో వ్యాప్తి గావించుకుంటూ పోవాలి. తక్కువ ఖర్చుతో యెక్కువ వుపయోగాన్ని మనము నిరూపించాలి. ఈ రెండింటిని మనము అభివృద్ధి పరచుకోవాలంటే Individual character, National characterను పెంచుకోవాలి. నా దేహము నాకెంత ప్రధానమో, నా దేశము నాకంత ప్రధానము, ఆధారము. నా కన్నతల్లి నాకు యెంత ప్రధానమో నాకు జన్మమిచ్చినటువంటి నా దేశముకూడను అంత ప్రధానము.

**కన్నతల్లి, కన్నదేశము స్వర్గముకంటెను మించినటువంటివి**

లంకనుంచి వెనుకకు వచ్చే సమయములోపల లక్ష్మణుడు పాదములు పట్టుకొని ప్రార్థిస్తాడు రాములను; "రామా! ఎట్లైనా భరతుడు నీ పాదుకలు తీసుకొనిపోయాడు. అయోధ్య పరిపాలన చేస్తూనే వున్నాడు. మనము వెళ్లినప్పటికినీ తండ్రి ఆజ్ఞ మనము పాటించక తప్పదు. అక్కడకు వెళ్లినప్పటికిని మనము యేదో చేతులు కట్టుకొని కూర్చోవాలి, భరతుని దగ్గర. ఈ లంకాపట్టణము చూస్తే చాలా వైభవముగా వుంటున్నాది. సువర్ణమయముగా ఉన్నది. ధనకనకవస్తువాహనాదులకు యెట్టిలోపము లేదు. విభీషణుడు, సుగ్రీవుడు, జాంబవతుడు తమ పాదాక్రాంతులుగా వుంటున్నారు. కనుక లంకాపురినే నీవు పరిపాలన చేయవచ్చును కదా, అయోధ్యకు యెందుకు పోవటం?" అన్నాడు. అందుకు బదులుగా "జననీ జన్మభూమిశ్చ స్వర్గాదపి గరీయసి" అన్నాడు, రాములు. "నా కన్నతల్లి, నా కన్నదేశము స్వర్గముకంటెను మించినటువంటివి. నాయనా! నీ తల్లి కురూపికావచ్చు. ఈ చూస్తున్నటువంటి వ్యక్తి చాలా అందమైనటువంటిదిగాను, పుష్టికరముగాను. ఆనందముగా వున్నటువంటిదిగాను వుండవచ్చును. కానీ, బయటి అందాన్ని చూచి, బయటసౌభాగ్యాన్ని చూచి నీకన్న తల్లిని నీవు దూరము చేసుకుంటావా? ఎటువంటిదైనను కురూపియైనను, భిక్షమెత్తేటువంటిదైనా తల్లితల్లియే! భారతదేశము బీదదేశము కావచ్చును. దానికి సరియైనటువంటి సౌభాగ్యమును తీర్చిదిద్దేవారు లేకపోవచ్చు. లంక సౌభాగ్యముతో సౌందర్యముగా వుండవచ్చును. కానీ నా తల్లి భారతదేశమే! లంక నాకేనాటికిని తల్లిగాదు", అని అత్యంత విశ్వాసముగా రాముడు లక్ష్మణునకు బోధించాడు. అదే రామనీతి. అదే ధర్మశాస్త్రము. అదే రామరాజ్యము. కనుక, మాతృదేశమునందు అభిమానాన్ని, ప్రేమను మనము అభివృద్ధిపరచుకోవాలి. అదే నిజమైన National character. ఈ National character మనకు వుండినప్పుడే మన వ్యక్తిగతశీలముకూడా పెంచుకోవచ్చును. లౌకిక, నైతిక, ఆధ్యాత్మిక, వైజ్ఞానిక ఈ విధంగా యే రంగములో ప్రవేశించినప్పటికి, మనము యీ రెండు శక్తులను రెండు నేత్రములుగా భావించి అభివృద్ధిపరచుకోవాలి.

**దైవాన్ని సంతోషపెట్టే గుణములను పెంచుకోండి!**

sri sathyasai vahini.org

విద్యార్థులారా! ధనము ప్రధానముకాదు. గుణము ఆధారము. దైవాన్ని సంతోషపెట్టేటువంటి గుణాన్ని మీరు పెంచుకోండి. దైవాన్ని సంతోషపెట్టేటువంటి భావాలు మీరు పెంచుకోండి. సర్వులయందు వున్నటువంటి దైవమును గుర్తించటానికి ప్రయత్నించండి. దైవము సంతృప్తిపడెనా జగత్తు సంతృప్తి పడుతుంది. దైవమునకు విరుద్ధమాయెనా జగత్తు మాత్రం నీకు విరుద్ధమే! ఒక చిన్న ఉదాహరణము. నేను ఒక అబ్బాయిని దగ్గరకు పిలచి 'యీ అబ్బాయి చాలా మంచివాడు' అని చెప్పనీ, యింక రేపటినుండి అందరుకూడా అతనిని పొగడుతూ వస్తారు, 'చాలా మంచివాడు చాలా మంచివాడు' అని. నేను 'రౌడీ' అని అన్నానా యింక అందరూ పిల్లలు మొదలుకొని పెద్దలవరకు 'వాడొక రౌడీ, రౌడీ' అని వానిని హీనంగా చూస్తారు. కనుక, దైవదృష్టిలో అల్పుడవు అయిపోతివా దేశమంతా నిన్ను అల్పునిగా చూస్తుంది. ఒక భక్తుడు చెప్పాడుః

**నీకే కానివాడనైతే లోకమాతా**
**నేను లోకమందు లోకువౌదు లోకమాతా**

అని. 'నీకే నేను కాకపోతే లోకానికంతా హీనమైపోతాను, తల్లీ లోకమాతా!' అని ప్రార్థించాడు.

**ఇచ్చువచ్చు చెడ్డపనులెల్లసేయ**
**ఆ ఈశ్వరుడు మిమ్ము సృజియించినాడా**
**తెచ్చుకొని చేతులార తెల్వియింకనైన మీరు**
**చెచ్చెరను హరిభజన సేయరారె**

మనకు చేతులనిచ్చినది యేదో అన్నిపనులు చేయటంకోసంకాదు. దైవాన్ని స్మరించటముకోసము. దైవాన్ని భజించటము కోసము. ఇతరులెవరైనా మంచి చెప్పుతే హాయిగా క్లాప్స్ వేయటంకోసము. ప్రతి అంగము పరమాత్మునియొక్క ప్రీత్యర్థముగా భావించుకొని సార్థకము చేసుకొనే పవిత్ర వ్యక్తులుగా మీరు తయారుకావాలి.

**పవిత్రమైన దివ్యతత్త్వమే అందరిని ఆకర్షిస్తుంది**

sri sathyasai vachanamrutam

శాస్త్రజ్ఞానము, అనుభవజ్ఞానము, వివేకజ్ఞానము, లౌకికజ్ఞానము అన్నీ మనకు వుంటుండాలి. ఈ నాలుగు యేకమైనప్పుడే నీవు విద్యావంతుడవుతావు. లేకపోతే యేదో కొంతకాలము పొట్టకూటి నిమిత్తమై ఒక subjectలో specialise చేసుకొని యేదో నీ జీవితము గడపుకోటము మాత్రమే జరుగుతుంది. మన Instituteలో విద్యార్థులందరు ఆదర్శమైన విద్యార్థులుగా తయారుకావాలి. ఏ దాంట్లో యెవరు ప్రశ్నించినప్పటికిని టక్‌మని జవాబు చెప్పేటువంటివారుగా వుండాలి. ఆ ఆకర్షణశక్తి తనలో వుండాలి. అదే దైవత్వము. ఇప్పుడు చూడండి స్వామి వుంటున్నారు. యెన్ని దేశముల వారు, యే యే ప్రాంతములవారు అందరూ వచ్చి యిక్కడ పడుతున్నారంటే వారికి యేమైనా invitations పంపిస్తున్నామా లేక advertisement చేస్తున్నామా? యేమీ లేదు. ఆ ఆకర్షణశక్తి, ఆ పవిత్రమైన దివ్యతత్త్వమే అందరిని ఆకర్షిస్తుంది. దైవత్వము సర్వత్రవుండినప్పటికిని ఒక్కొక్క స్థానములో అది ప్రత్యేకమైన ఆకర్షణను పొందుతూ వుంటుంది. కాశీ గొప్ప క్షేత్రము. తిరుపతి గొప్పక్షేత్రము, శ్రీరంగము గొప్పక్షేత్రము అని మనము చెప్పకోవచ్చును. బదరీ, అమర్‌నాథ్, కేదారములు యివన్నీ పవిత్రక్షేత్రాలు. ఈ క్షేత్రములన్నీ స్థలమహత్యముతో వచ్చినటువంటివికావు. గుణ మహత్యముతో వచ్చినటువంటివి. అన్ని క్షేత్రములుకూడను మనయొక్క హృదయములోనే వుంటున్నాయి. వాటిని మనము అభివృద్ధి గావించుకొనే నిమిత్తమై యీ బహిర్ముఖములైన స్థానములంతా దర్శిస్తూ వస్తున్నాము. పొదలో కనుపించేటువంటి పిట్ట చేతిలో వున్నటువంటి పిట్టనే! కానీ కొంతమంది అజ్ఞానులు, అవివేకులు పొదలో వుండేటువంటి పిట్టను చూచి చేతిలో వుండిన పిట్టను వదలిపెడుతున్నారు. సులభముగా మనకు చిక్కినటువంటిదానిని వదలి పెడుతున్నాము. కమల పుష్పములో వున్న మకరందాన్ని మాత్రమే తుమ్మెద కోరుతున్నాది. కప్ప చేరువగానే వుంది. ఎంతసేపైనా నీటిలో యీదులాడుతుంది. తుమ్మెద ఈ తామర పుష్పముపైన కొంచెము సేపు రెస్టు తీసుకుందామని తాను పుష్పముపైన యెగురుతూ వుండాది. కానీ తుమ్మెదకు రెస్టు వుండదు. కప్ప తీపి యెరుగదు. తుమ్మెద ఆ పుష్పములో చేరేంతవరకును ఝూంఝూం అని నిర్విరామముగా అరుస్తూ వుంటుంది పాపం. ఆ పుష్పములో చేరెనా శబ్దము సైలెంటు అయిపోతుంది. ఆ మకరందమును గ్రోలి వున్మత్తమవుతుంది. అనగా

sri sathyasai vahanamrutam

మత్తెక్కుతుంది. అలాంటి సంబంధాన్ని మనము పెంచుకోవాలిగానీ యితరముగా కాదు. ఒక్కొక్క ప్రదేశము మనము సందర్శించినప్పుడు దానియొక్క పవిత్రతను మన హృదయములోపల స్మరింప చేయటానికి అవకాశముంటుంది. ఎక్కడచూచినాగానీ reflection of the inner being లోపలి పరితాపమే, పరివర్తనే. అదియే పరాభక్తి అన్నారు. అదే అనన్యభక్తి అన్నారు. అదే స్వాధ్యాయ భక్తి అన్నారు. తన తత్వాన్ని తాను గుర్తించుకొని వర్తించే యథార్థమైనటువంటి మార్గాన్ని మనము గుర్తించాలి. అందుకోసమే గోపికలు కృష్ణుని ప్రార్థిస్తూవచ్చారు.

**పుష్పంబువై నీవు పొలుపొందుచుండిన**
**తుమ్మెదనై నేను తిరుగుచుందు**
**వృక్షంబువై నీవు వర్ధిల్లుచుండిన**
**వల్లికనై నేను అల్లుకొందు**
**వరసముద్రుడే నీవై యుండిన**
**వాహిని నేనగుచు నీలో ఐక్యమగుదు**
**మేరు పర్వతము నీవై యుండిన**
**నిన్ను కరచుకొని పారుదు నేను సెలయేరునై**
**అనంత ఆకాశమే నీవైన**
**చుక్కనై నీలోన చెలగుచుందు**

చూశారా! "ఆకాశమే నీవైతే ఓ పరమాత్మా నన్ను నీలో ఒక చిన్న చుక్క మాదిరి పెట్టుకో! లేదా అనంతమైన సముద్రమే నీవైతే నన్ను అందులో అలలుగా తయారుచేసుకో లేక నేనొక వాహినిగా వచ్చి నీలో చేరిపోతాను. పోనీ పుష్పముగా నీవు పుడితే నేను నిన్ను వదలకుండా లోపలికి వచ్చి ప్రవేశిస్తాను. తుమ్మెదగా నన్ను పుట్టించు. పెద్ద పర్వతముగా నీవుంటే నిన్ను విడచిపెట్టక ఫాల్సు మాదిరి నేను తయారైపోవాలి", ఇలాంటి యేకత్వాన్ని ఆశిస్తూవచ్చారు పరమభక్తులు. అలాంటి యేకత్వములోనే ఆనందము వుంటుండాది. అట్టి ఆనందమే అనంతత్వము. అదే అమరత్వము. అదే అమృతత్వము. అలాంటి అమృతత్వాన్ని,

srisathyasaivachanamrutam

అనంతత్వాన్ని మనము అనుభవించి పరులకు అందించటానికి ప్రయత్నించాలి. యీ విద్యావిధానాన్ని ఒక విధమైనటువంటి అనుభూతిలోకి తెప్పించుకొని, అనుభూతినుండి వివేకమునకు మార్చుకొని, వివేకమునుండి లౌకికమైన జగత్తులో అందరికికూడను అందించటానికి ప్రయత్నించాలని నేను ఆశిస్తూ, ఆశీర్వదిస్తూ నా ప్రసంగాన్ని విరమిస్తున్నాను.

**(తేదీ 08-03-1987న ఇన్స్టిట్యూట్ ఆడిటోరియంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vachanamrutam